క్లుప్తంగా

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



రాహుల్‌ను సన్మానించిన ఆచారి తదితరులు

ఆమనగల్లు: నీట్ ఫలితాల్లో 470 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 591వ ర్యాంకు పొందిన రాహుల్, అతని తండ్రి పత్యనాయక్‌లను శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, సుందూరి శేఖర్, చెన్నకేశవులు, రవిరాథోడ్, పాష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న టీచర్ సాయివాణి

కడ్తాల్: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సాయివాణి.. శనివారం విద్యార్థులకు సొంత ఖర్చుతో రాత పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రజాక్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూత నందించడం అభినందనీయమన్నారు. అనంతరం టీచర్‌ను అభినందించారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్యగౌడ్, జంగయ్య, బీఎస్‌ఎన్ మూర్తి, జ్యోతి, సంగీత తదితరులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం



దాతను అభినందిస్తున్న యువజన సంఘం సభ్యులు

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మునిరాజు ఆలయాల నిర్మాణానికి సంతోజ్ రవీందర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి విక్రాంత్‌చారి రూ.50 వేల విలువ గల నిర్మాణ సామగ్రిని శనివారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను స్థానికులు అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి ..

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఓ దాత రూ.10 వేల విరాళం అందజేశారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ పరిధి గౌరారంలో సర్కారు బడి అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకుడు శ్రీపాతి వినోద్‌రెడ్డి శనివారం మండల విద్యాధికారి పాండుకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

'పాపిశెట్టి'కి పాలమూరు అవార్డు



రాముకు అవార్డు అందజేస్తున్న ఎంపీ తదితరులు

ఆమనగల్లు: ప్రముఖ సంఘ సేవకుడు, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాముకు జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పాలమూరు మట్టి మాణిక్యాలు' అవార్డు దక్కింది. వివిధ సేవారంగాల్లో రాణించిన వారికి ఈ సంస్థ ఏటా అవార్డులు ప్రదానం చేస్తుంటుంది. అందులో భాగంగానే రాముకు.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మల్లురవి, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణలు అవార్డును అందజేశారు.

లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డి



ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్‌గా 2025- 26 ఏడాదికి ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యుడు సంపతి జనార్దన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పరిధిలోని 12 క్లబ్‌లలో సేవా కార్యక్రమాలు నిర్వహించి, రీజియన్‌ను ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. జనార్దన్ ఎంపిక పట్ల క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, పీఆర్‌ఓ పాషాలు హర్షం వ్యక్తం చేశారు.



యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా సాధన చేస్తున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు తదితరులు



ఆమనగల్లు: శ్రీకర యోగా శిక్షణ కేంద్రంలో..



ఇబ్రహీంపట్నం: కోర్టు ఆవరణలో.. న్యాయమూర్తులు ఎస్.శ్రీదేవి, యశ్వంత్‌సింగ్ తదితరులు

నిత్య సాధన.. నూతన జీవతం



ఆమనగల్లులో ఆసనంలో యోగా సాధకుడు

'ఉరుకుల పరుగుల జీవితంలో యోగా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నిత్యం ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతాం . ఒత్తిడిని జయిస్తాం. రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతాం' అని వక్తలు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లులో పాఠశాలలు, పార్కులు, మైదానాలలో యోగా నిపుణుల ఆధ్వర్యంలో సకల జనులు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దినచర్యలో యోగా తప్పనిసరని, రోజువారి సాధనద్వారా.. ఆరోగ్యకరమైన కొత్త జీవనం గడపవచ్చని పేర్కొన్నారు.

–సాక్షి, నెటవర్క్



ఆమనగల్లు: మాడ్గులలో.. ఏబీవీపీ నాయకులు



ఆమనగల్లు: ప్రైవేటు పాఠశాల ఆవరణలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



ఆమనగల్లులో.. మార్కెట్ చైర్‌పర్సన్ గీత తదితరులు



కడ్తాల్‌లో..



తుర్కయంజాల్: కమ్మగూడలో..



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో..



కడ్తాల్: యోగా సాధనలో..

రేపు ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట లక్ష్మారెడ్డి పాలెంలోని వర్ద్ అండ్ డీడ్ క్యాంపస్‌లో యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొనసాగే శిబిరంలో.. సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, రక్త, దంత, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

యాచారం: మండల పరిధి తక్కళ్లపల్లి గ్రామాభివృద్ధికి టీజీఐఐసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మాజీ ఉప సర్పంచ్ పగుడాల శ్రీశైలం కోరారు. శనివారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర పనులు పూర్తి చేసుకుంటామని పేర్కొన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని శ్రీశైలం తెలిపారు.

27న దుకాణ సముదాయం ప్రారంభం

ఆమనగల్లు: మార్కెట్‌యార్డులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఈ నెల 27న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ప్రారంభించనున్నామని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో ఆమె మట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్‌కమిటీ పనిచేస్తుందని చెప్పారు. మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు అంజయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, రమేశ్‌గౌడ్, పాండురంగయ్య, జంగయ్యగౌడ్,యాదయ్య, సంపత్‌కుమార్, నరేశ్‌నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, అజీం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 రోజులు.. 960 దరఖాస్తులు

- రెవెన్యూ సదస్సులకు వెల్లువెత్తిన భూ సమస్యల అర్జీలు
- శాశ్వత పరిష్కారం కోసం బాధితుల ఎదురుచూపు



కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టానికి ప్రధాన్యత సంతరించుకుంది. కొత్త చట్టంలో భాగంగా మండల పరిధి 15 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. 960 దరఖాస్తులు వచ్చి చేరాయి. మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణం తక్కువగా ఉండటం, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, వారసత్వ పట్టా అమలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారని అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాల వారీగా..

మక్తమాధారం 26, వాస్‌దేవ్‌పూర్ 14, రావిచేడ్ 34, నాగిరెడ్డిగూడ 2, సాలార్‌పూర్ 26, టాక్‌రాజ్‌గూడ 6, కడ్తాల్, మైసిగండిలో 530, న్యామతాపూర్ 38, వంపుగూడ 9, చల్లంపల్లి 41, చరికొండ 46, ఎక్‌రాజ్‌గూడ 0, ముద్విన్ 112, కర్కల్ పహాడ్76 మంది భూ బాధితుల నుంచి దరఖాస్తులు అందాయి.

నిషేధిత జాబితా నుంచి..

మిస్సింగ్ సర్వే నంబర్లు 270, పెండింగ్ మ్యుటేషన్ 65, విస్తీర్ణం తగ్గుదల 178, భూమి స్వరూపం మార్పు 62, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 85, వారసత్వ పట్టా అమలు కోరుతూ 38, ప్రభుత్వ భూమికి సంబంధించి లావణి పట్టా ఉండి, కొత్త పాసుబుక్ కొరకు 74, పేరు తప్పుగా ఉండటం, ఆధార్ నమోదు, కులం తప్పుగా నమోదుకు సంబంధించి 65, ఇతర సమస్యలవి 74 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి, అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు.. కొత్త చట్టంతో శాశ్వతంగా పరిష్కారమవుతాయని భూ యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జయశంకర్ వర్ధంతి



జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి శనివారం ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సార్ విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావానికి నిరంతరం కృషి చేసిన గొప్పమేధావి కొత్తపల్లి అని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, ఎంపీడీఓ కుసుమమాధురి, మాజీ ఎంపీపీ అనిత, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, అంజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, నాయకులు మానయ్య, మల్లయ్య, విజయ్‌రాథోడ్, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో.. ఉజ్వల భవిష్యత్తు



ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

- సాంకేతిక నైపుణ్యంతో మెండుగా ఉద్యోగాలు: వక్తలు

ఇబ్రహీంపట్నం: ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టెక్ మహేంద్ర హెచ్‌ఆర్ మేనేజర్ జి.రవిచంద్ర, కాగ్నిజెంట్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ మేనేజర్ డీజీ ప్రవీణ్‌లు అన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ పొందితే అద్భుత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. శనివారం శేరిగూడ శ్రీదత్త విద్యాసంస్థలో ప్లేస్‌మెంట్ అచీవర్స్ డే 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యంతో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఆ దిశగా నైపుణ్యత సాధించేందుకు తర్ఫీదు తీసుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులు వంద శాతం ప్లేసిమెంట్ సాధిస్తుండటం అభినందనీయన్నారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. తమ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ, పలు అవార్డులను సైతం సొంతం చేసుకున్నారని తెలిపారు. కొందరు విద్యార్థులు రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు పొందడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ మేనేజర్ డి.అభిషేక్, విద్యాసంస్థల వైస్ చైర్మన్ విభవ్‌రెడ్డి, డైరెక్టర్ దేవేంద్ర విక్రంరెడ్డి, ప్రిన్సిపాల్స్ సెంథిల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, టీపీఓ మయూరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విగ్రహాల ప్రతిష్ఠాపన

ఇబ్రహీంపట్నం: రుక్మిణీ పాండురంగస్వామి చిత్రపటం ఊరేగింపును శనివారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓం చౌరస్తా నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. ఆ ఆలయంలో నిర్మించిన గద్దెపై చిత్రపటాన్ని ముందుగా ప్రతిష్టిస్తారు. త్వరలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని ఆలయ నిర్వాహకులు, న్యాయవాది భగయత్ నాగేశ్వర్‌రావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ ఈ నెల 23న చేపట్టబోయే చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే కగార్‌ను కొనసాగిస్తుందని ఆరోపించారు. వెంటనే దానిని నిలిపివేసి, మావోయిస్టులతో చర్యలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం చలో రాజ్ భవన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో అజయ్, శ్రీకాంత్, రాజేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ నాయక్

యాచారం: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంగా మారిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి అంగోత్ వెంకటేశ్ నాయక్ అన్నారు. తక్కళ్లపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధి ఎర్రగొల్లతండాకు చెందిన రమావత్ తుల్చాకు సీఎంఆర్ఎఫ్ పథకం కింద రూ.32 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శనివారం ఆయన బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేశ్యానాయక్, మాజీ సర్పంచ్ మోతీరాం నాయక్, నాయకులు శ్రీరామ్ నాయక్, సీతారాంనాయక్, చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో శనివారం పలువురు నిరుపేద కుటుంబాలకు ఆల్ఫా ఒమేగా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు కిరణ్ ఎలైజా, సభ్యులు కట్టా రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- 'ఇందిరమ్మ' లబ్ధిదారులు గడువులోగా ఇంటిని నిర్మించుకోవాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం, ముకునూర్, రాయపోల్ గ్రామాల్లో సుమారు రెండు కోట్ల రూపాయలతో చేపట్టిన పంచాయతీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాయపోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గడువులోగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. రైతు భరోసా అందలేదని రైతులు ఆందోళన చెందుతున్నారని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. రాయపోల్, దండుమైలారం మీదుగా విజయవాడ జాతీయ రహదారికి వెళ్లే మార్గం అధ్వానంగా మారిందని, ఈ రోడ్డును బాగు చేయించాలని బీజేపీ నేతలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జంగయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, భూపతిగాళ్ల మహిపాల్, మంఖాల దాసు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రావు, పీఆర్ పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ట్రైనీ ఎస్ఐ చంద్రశేఖర్

కడ్తాల్: ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందని ట్రైనీ ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రణాళికతో విద్యనభ్యసిస్తే జీవిత లక్ష్యాలను చేరుకోవచ్చునని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చవచ్చని తెలిపారు. చిన్నారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆటల వలన కలిగే ప్రయోజనాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, జంక్ ఫుడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మత్తు పదార్థాల వలన కలిగే నష్టాల గురించి వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, పోలీసు సిబ్బంది శేఖర్, సుమిత్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

అర్హులకు 'భరోసా' కల్పించాలి

- సాయం నిలిపివేతకు నిరసనగా.. రేపు ధర్నా
- సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్



మాట్లాడుతున్న కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్

ఇబ్రహీంపట్నం: అర్హులైన రైతులకు సాగు సాయం అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔటర్ రింగ్‌రోడ్డు ఆనుకొని ఉన్న 10 మండలాల రైతులకు రైతు భరోసా నిలిపివేయడం సరైంది కాదన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసి, నగర ప్రజలకు సరఫరా చేస్తుంటే.. ఆర్థికంగా స్థిరపడ్డారని పేర్కొంటూ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. నేల తల్లిని నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న రైతుల పట్ల ప్రభుత్వం వివక్షత చూపడం మంచిది కాదని హితవు పలికారు. ఇందుకు నిరసనగా సోమవారం 20 వేల మంది రైతులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నామని తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు జంగయ్య, జగన్, గణేశ్, రమేష్, ముసలయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, వంశీ, వినయ్‌లు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386